ఆంధ్రజ్యోతి

andhrajyothy.com


మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.3 | కనిష్ఠం 11.2

ఆదిలాబాద్

జిల్లా వార్తలు

5

బుధవారం 12 నవంబరు 2025





ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న డీసీసీబీ చైర్మన్, అధికారులు

జిల్లాకు స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్

ఆదిలాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మంగళవారం రాత్రి జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ కమిషనర్ రాజు, పర్యాటక శాఖ అధికారి రవి, పంచాయతీరాజ్ అధికారి రమేష్, తదితరులు కమిషన్ చైర్మన్‌కు పూలమొక్కను అందించి శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించే అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొననున్నారు. సాయంత్రం తిరిగి హైదరాబాద్ వెళ్లనున్నారు.



జిల్లాకేంద్రంలో చలిమంటలు వేసుకున్న ప్రజలు

వామ్మో చలి..

- జిల్లాలో నాలుగైదు రోజులుగా వేగంగా పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
- శీతల గాలుల ప్రభావంతో ఉక్కిరిబిక్కిరి
- వృద్ధులు, చిన్నారులకు తప్పని తిప్పలు
- బజార్హత్నూర్‌లో 10.2 డిగ్రీల అత్యల్ప కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

మరిన్ని వివరాలు 7వ పేజీలో....





సంక్షేమానికి.. బ్రేక్!

- జిల్లాలో పత్తాలేని రాజీవ్ యువ వికాసం, చేయూత పథకాలు
- ఆరేళ్లుగా ఆసరా పింఛన్ల కోసం తప్పని ఎదురుచూపులు
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు
- సమాధానం చెప్పలేక తప్పించుకుంటున్న జిల్లా అధికారులు

ప్రభుత్వ పథకాల అమలుకు నిధుల కొరత

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే.. పలు సంక్షేమ పథకాలకు నిధుల కటకటతో బ్రేక్ పడుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లకు దగ్గర పడుతున్నా.. సంక్షేమ పథకాల అమలుపై ఊసేత్తక పోవడంతో అర్హులైన లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినా.. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో పథకాల అమలుకు శ్రీకారం చుట్టడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఆదిలాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రారంభించిన పలు సంక్షేమ పథకాలు అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లకు వేళల్లో దరఖాస్తులు రాగా.. కొందరికే మంజూరు చేయడంతో మిగితా లబ్ధిదారులు తీవ్రనిరాశకు గురవుతున్నారు. క్షేత్రస్థాయిలో సర్వేను నిర్వహించి లబ్ధిదారులను ఎల్-1, ఎల్-2, ఎల్-3గా గుర్తించిన అధికారులు మొదట ఎల్-1 లబ్ధిదారులకు మాత్రమే ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేస్తున్నారు. అలాగే గత ఐదేళ్ల క్రితం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించక పోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దీంతో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని ద్రాక్షగానే మారుతున్నాయి. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు యధావిధిగానే కొనసాగుతున్నా.. అదనంగా అందించే తులం బంగారం కోసం ఆడపడుచులు ఎదురుచూడాల్సి వస్తుంది. సంక్షేమ పథకాల అమలుకు సరిపడా నిధులు విడుదల కాకపోవడంతో పథకాల అమలు ముందుకెళ్లడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలోనే వెనుకబడిన జిల్లాపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు, సంక్షేమ పథకాల అమలుకు కోతలు తీవ్రప్రభావాన్ని చూపుతున్నాయి. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు లేవంటూ అధికారులు సమాధానం చెప్పలేక చేతులెత్తేస్తున్నారు.

'వికాసం' ఉత్తిదేనా?

నిరుపేద నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు చేపట్టిన రాజీవ్ యువవికాసం పథకం ఉత్తదేనన్న వాదనలు (తరువాయి 6వ పేజీలో....)



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు మద్దేల నిరోషా. గ్రామం తోషం, గుడిహత్నూర్ మండలం. భర్త బుచ్చన్న ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి అనారోగ్య కారణాలతో గత ఐదేళ్ల క్రితం అక్కడే మరణించాడు. అప్పటి నుంచి బాధ్యతలను భుజాన వేసుకొని కష్టాలతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తుంది. వితంతు పింఛన్ కోసం పలుమార్లు గుడిహత్నూర్ మండలాధికారులను ఆశ్రయించిన పట్టించుకోవడం లేదని వాపోతోంది. ఆన్‌లైన్‌లో కు అవకాశం లేదంటూ సమాధానం ఇస్తున్నారని చెబుతుంది. ఐదేళ్ల గడిచిపోతున్న ఇప్పటి వరకు ఆసరా పింఛన్ మంజూరు కాలేదు. కనీసం దరఖాస్తు చేసుకునేందుకైనా అవకాశం లేకపోవడంతో పింఛన్‌పై ఆశలు వదిలేసుకుంది. ఇలాంటి పరిస్థితులే జిల్లాలో చాలా మంది వితంతు మహిళలు ఎదుర్కొంటున్నారు.

ఉపాధి కల్పిస్తామన్నారు.. : చందల్ ఇంద్రజిత్, గోకొండ గ్రామం, బజార్‌హత్నూర్ మండలం



ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం కింద ఉపాధి కల్పిస్తామంటే దరఖాస్తు చేసుకున్న. ఇప్పటివరకు మంజూరు చేయలేదు. అధికారులను అడుగుతే ప్రభుత్వం నుంచే రావాల్సి ఉందంటున్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా టీ షాప్ కోసం దరఖాస్తు పెట్టుకున్న. అధికారులు సర్వే కూడా చేశారు. 5 నెలలుగా మంజూరుకు ఎదురుచూడల్సి వస్తుంది. ఏం చేయాలో అర్థం కాక వ్యవసాయం చేసుకుంటున్న.

ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న.. : మాలపతి దేవమ్మ, పొన్నారి గ్రామం, తాంసి మండలం



ఐదేళ్లగా పింఛన్ కోసం ఎదురుచూస్తున్న రావడం లేదు. నా భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇప్పటివరకు వితంతు పింఛను మంజూరు కావడం లేదు. ఎన్నిసార్లు అధికారులను అడిగిన ఇదిగో అదిగో అంటూ కాలం గడవుతున్నారు. పింఛన్ కోసం ఎవరిని అడగానో అర్థం కావడం లేదు. ఒంటరిగా బతుకుతున్న ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ నైపుణ్యాలు సాధించి ఉన్నతంగా ఎదగాలని ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి వకులభరణం ఆదినాథ్ అన్నారు. మంగళవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆదిలాబాద్ ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ 2025 అండర్ 10, 12, 14, 16 బాలబాలికలకు పోటీలను నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో తొలి రోజు అథ్లెటిక్స్, క్యారం, చెస్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.అనంతరం క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినాథ్ మాట్లాడుతూ... ప్రైవేట్ విద్యార్థుల కోసం పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమని, వీటికి ట్రస్మా తరఫున సైతం అవసరమైన సహకారం అందిస్తామన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ నైపుణ్యాలను సాధించి... ఉన్నత లక్ష్యాలను సాధించాలని దిశా నిర్దేశం చేశారు.



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగ యువత

జాబ్‌మేళాలో 15 మంది ఎంపిక

ఉట్నూర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంపార్టికస్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన బ్యాంకు ఇంటర్వ్యూలకు 277 మంది హాజరు కాగా 15 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్ తెలిపారు. ఈ ప్రక్రియలో మొత్తం మూడు రౌండ్లు జరిగాయని, 15 మంది చివరి రౌండ్‌లో ఎంపికైనట్లు కంపెనీ హెచ్‌ఆర్ వినయ్ తెలిపారన్నారు. ఎంపికైన వారికి రూ.20వేలకు పైగా జీతం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సాయిప్రసాద్, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ ఎస్‌కే ముజీబ్, డాక్టర్ నర్సింగ్‌రావు, డాక్టర్ రాణి, డాక్టర్ అనిత, డాక్టర్ రవీందర్, రాజశేఖర్, శ్రీకాంత్, కరుణాకర్, మెంటార్ చైతన్య, అధ్యాపకులు తిరుపతి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కిషన్, డాక్టర్ నవీన్, రాజుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయం

- ఎస్పీ అఖిల్ మహాజన్
- తలమడుగు, తాంసి, ఆదిలాబాద్ రూరల్ మండలాల్లోని హాట్ స్పాట్‌ల పరిశీలన
- ఆర్అండ్‌బీ, పోలీస్, రెవెన్యూ, ఆర్డీవో, పంచాయతీరాజ్ అధికారులతో ప్రమాదాల నివారణపై చర్చలు

తలమడుగు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక ప్రణాళికను రూపొందించి అవలంబించడం జరుగుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం జిల్లాలోని మూడు మండలాల్లో గల ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను ఎస్పీ సందర్శించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. దీనిలో భాగంగా ఆర్అండ్‌బి, రెవెన్యూ, పంచాయతీరాజ్, నేషనల్ హైవే అథారిటీ, కాంట్రాక్టర్స్‌తో పాటుగా పోలీసు అధికారులతో ప్రమాదాల స్థలాలను పరిశీలించి సిబ్బందికి, అధికారులకు ప్రమాదాల నివారణకు చేయవలసిన సూచనలు చేశారు. ముఖ్యంగా తాంసి, తలమడుగు మండలాలలో ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను, అలాగే ఆదిలాబాద్ రూరల్ పరిధిలో ఉన్న ప్రదేశాలను పరిశీలించారు. గత రెండు సంవత్సరాలుగా జరిగిన ప్రమాదాలపై విశ్లేషణ చేసి ఇకముందు ప్రమాదాలు జరగకుండా చర్యల చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదాలు జరగకుండా రహదారుల వెంట ఉన్న గ్రామాలకు వెళ్లే రోడ్ల యందు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని, అవసరమైన ప్రదేశాలలో రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని, నిర్మాణ ప్రదేశాలలో తగు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, రాత్రి సమయాలలో కనిపించే విధంగా రేడియంతో స్టిక్కర్లను ఏర్పాటు చేసే ప్రమాదాలు జరగకుండా నివారించాలని సూచించారు.



ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

రూరల్ సిఐ కె.ఫణిదర్, తహసీల్దార్ రాజమోహన్, ఎస్ఐలు డి. రాధిక, జీవన్ రెడ్డి, విష్ణువర్ధన్, పంచాయతీ సెక్రెటరీ సుజాత, సచిన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్: ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం మండలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరిగే హాట్ స్పాట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక ప్రణాళికను రూపొందించే అవలంబందించడం జరుగుతుందని తెలిపారు. ప్రమాదాలను నివారించే ప్రాణ నష్టాన్ని తగ్గించడమే జిల్లా పోలీసుల ప్రధాన ధ్యేయంగా, ప్రజల రక్షణకై పోలీసు వ్యవస్థ కష్టపడుతుందని తెలిపారు. రూరల్ సీఐ కె.ఫణిదర్, ఎస్సై విష్ణువర్ధన్, రాధిక, జీవన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తాంసి రూరల్: అంతర్ రాష్ట్ర రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం మండలంలోని పొన్నారి, హస్నాపూర్, గిరిగావ్ గ్రామాల్లో సైలెంట్‌గా ఆయన సందర్శించారు. రోడ్డుపై వాహనాలు ఎలా నడుపుతున్నారో ఎంత మేరకు స్పీడుతో నడుపుతున్నారో? క్షుణ్ణంగా పరిశీలించారు. ఇప్పటి వరకు ఎక్కడెక్కడ ఎన్ని ప్రమాదాలు జరిగాయో సంబంధిత పోలీసులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మాజీ ఎంపీటీసీ రేఖ రఘు, పోలీస్ అధికారులు, తదితరులున్నారు.

ఆధునిక విద్యా వ్యవస్థకు.. పునాదులు వేసిన దార్శనికుడు

- కలెక్టర్ రాజర్షి షా
- ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి
- నివాళ్లు అర్పించిన అధికారులు, నాయకులు, విద్యార్థులు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి విద్యాశాఖ మంత్రిగా దేశంలో ఆధునిక విద్యా వ్యవస్థకు పునాదులు వేసిన దార్శనికుడు, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆజాద్ 137వ జయంతి సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు కవులు, మీడియా ప్రతినిధులను సన్మానించారు. ఈమేరకు కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. మైనారిటీల విద్యా అభివృద్ధి, సంక్షేమం కోసం విశేష కృషి చేసిన ఆదర్శమూర్తి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో విద్యార్థుల హాజరు శాతం పెంపు కోసం ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడు మొహమ్మద్ అథర్ ఉల్లా, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మైనార్టీ సంక్షేమ అధికారి ఖలీం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ టౌన్: సమాఖ్యత భావాన్ని పెంపొందించిన మహనీయుడు దేశ తొలివిద్య శాఖ మంత్రి మౌలన అబుల్ కలాం అజాద్ అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం మౌలన అబుల్ కలాం జయంతిని పురస్కరించుకొని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి అందజేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను స్మరిస్తు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, నాయకులు పవన్ నాయక్, సయ్యద్ సాజిదొద్దీన్, యూనిస్ అక్బాని, జహురోద్దిన్, ప్రకాష్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, తదితరులు



ఆదిలాబాద్‌లో నివాళ్లు అర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు

నేరడిగొండ: స్వాతంత్ర్య భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రిగా పని చేసి దేశ విద్యారంగానికి పునాదులు వేసిన ఘనత మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కే దక్కుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శబార తరన్నుమ్ అన్నారు. మౌలానా అబుల్ కలామ్ జయంతి సందర్భంగా మంగళవారం కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

అయ్యప్ప భక్తుడి సైకిల్ యాత్ర

- 'సేవ్ గర్ల్' అనే నినాదంతో ఢిల్లీకి..

ఇచ్చోడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కడుపులో ఆడబిడ్డ ఉందని తెలియగానే కొందరు భ్రూణహత్యలకు పాల్పడుతున్నారని, ఈ దారుణాలపై జాన జాగృతికి తన వంతుగా నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాస్ సోమవారం నుంచి దేశ రాజధాని ఢిల్లీకి సైకిల్ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్రలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయాన్ని సందర్శించి సేదతీరారు. గతంలో జరిగిన కొన్ని సంఘటనలు తనను కలిచివేశాయని, ఆడపిల్లలను చంపద్దంటూ చైతన్యం కలిగించే నినాదాలు సైకిల్ ముందర భాగంలో బోర్డుపై రాయించారు. సేవ్ గర్ల్, సేవ్ వుమెన్, సేవ్ ఇండియా అనే నినాదంతో ఢిల్లీకి బయలుదేరాడు. ప్రధాని మోదీని కలిసే ప్రయత్నం చేస్తానన్నారు. మంగళవారం ఇచ్చోడకు చేరుకున్న శ్రీనివాస్ 12రోజుల్లో ఢిల్లీకి చేరుకుంటానన్నారు.



శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న యువకులు

విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలి

- ఉట్నూర్ ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యువరాజ్ మర్మాట్
- జిల్లా కేంద్రంలోని కొలాం గిరిజన ఆశ్రమ బాలురు పాఠశాల తనిఖీ

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కొలాం గిరిజన ఆశ్రమ బాలురు పాఠశాలను సందర్శించి రిజిస్టర్‌లు, తరగతిగదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ.. విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతీరోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని, విద్యార్థులకు అవసరమైన ఐరన్, సి విటమిన్ టాబ్లెట్లను అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాలని తెలిపారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. దోమల కారణంగా వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించి, సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు.



ఆశ్రమ పాఠశాలలో వంటకాలను పరిశీలిస్తున్న యువరాజ్ మర్మాట్



ఉట్నూర్‌లో నర్సు కోర్సు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి

ఆరోగ్యరంగ అభివృద్ధికి కృషి చేయాలి

ఉట్నూర్: శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను ఆరోగ్యరంగ అభివృద్ధికి వినియోగించాలని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ, కేర్ విద్యా అకాడమి ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అసిస్టెంట్ నర్సుకోర్సు సెంటర్ యూత్ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ శిక్షణలో అందిస్తున్న అంశాలను ఏకాగ్రతతో నేర్చుకోవాలని, ఆరోగ్యరంగ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాబ్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్ బి.నాగభూషణ్, శిక్షణ కేంద్రం సిబ్బంది, కేర్ విద్యా అకాడమిఆర్గనైజేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 'బాల్య వివాహ ముక్త్ భారత్' 30 రోజుల క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని భీంసరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా మిషన్ శక్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీష్ మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అదేవిధంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా 8, 9, 10వ తరగతి పిల్లలతో కిషోరీ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లోని బాలబాలికలందరికి బాల్య వివాహాలపై చైల్డ్ హెల్ప్ లైన్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించి పిల్లలకు ఏవిధమైన సహాయం కావాలన్నా చైల్డ్ హెల్ప్ లైన్ 1098ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ కోటేశ్వర్, నిఖిలేశ్వర్, సఖి లీగల్ కౌన్సిలర్ సంఘమిత్ర, ష్యూర్ ఎన్జీవో ప్రతినిధి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీష్



జీఆర్ కుర్మే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ గోడం నగేష్

కుర్మే కుటుంబానికి ఎంపీ పరామర్శ

నేరడిగొండ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, ప్రజా కవి గంగారాం కుర్మే కుటుంబ సభ్యులను ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ పరామర్శించారు. ఇటీవల ఆయన మృతి చెందగా మంగళవారం మండల కేంద్రంలోని ఆయన నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా జీఆర్ కుర్మే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గంగారాం కుర్మే గారి సేవలను స్మరించుకున్నారు. పార్టీలో నిబద్ధతగా పనిచేయడంతో పాటు గ్రామాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. ఎంపీ వెంట బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తాటిపెల్లి గంగాధర్ రావు, బీజేపీ మండల అధ్యక్షుడు ఆకుల రాజశేఖర్, నాయకులు గాదె శంకర్, ఆడెపు రమేష్, రాజేష్వర్, భోజన్న, భీమ్ రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై ఐక్యంగా పోరాడాలి

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలపై ప్రభుత్వాలు చిత్తశుద్ధిగా వ్యవహరించడం లేదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. మంగళవారం సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏఐటీయూసీ పట్టణ 4వ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టి భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వాలు వాటిని పట్టించుకోవడం లేదన్నారు. డిమాండ్ల సాధనకు ఐక్యంగా ఉంటూ పోరాటాలు చేయాలన్నారు. అంతేకాకుండా కార్మికులను రాజకీయంగా చైతన్యంతులను చేయాల్సిన అవసరం ఉందని, కార్మిక ప్రతినిధిని పార్లమెంట్‌కు పంపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సిర్ర దేవేందర్, గాజేంగుల రాజు, రాధ, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు ప్రభుత్వాలు అండగా నిలవాలి

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు అండగా నిలవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి సంక్షేమాన్ని పూర్తిగా విడిచిపెట్టాయని, తేమ నిబంధనలు, కొనుగోళ్లలో పరిమితిని విధిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆక్షేపించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి ఆధ్వర్యంలో అఖిలపక్ష రాజకీయ పార్టీలు, రైతు సంఘం నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పంట కొనుగోళ్లలో అన్నదాతలు పడుతున్న ఇబ్బందులు, వాటి సాధనకు చేపట్టవలసిన భవిష్యత్ కార్యాచరణ, తదితర అంశాలపై చర్చించారు. ఇందులో విజ్జగిరి నారాయణ, దర్శనాల మల్లేష్, సిర్ర దేవేందర్, వెంటక నారాయణ, రమేష్, అగ్గిమల్ల గణేష్, బండి దత్తాత్రి, కొండ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

రైతుల ఆదాయం పెంచే దిశగా చర్యలు

» కలెక్టర్ రాజర్షిషా » సీతగొందిలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సు » పెద్దసంఖ్యలో హాజరైన రైతులు



సీతగొందిలో పాల్గొన్న రైతులు(ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్)



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

గుడిహత్నూర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయంలో సాంకేతికతను చేరువ చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం మండలంలోని సీతగొందిలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతుల అవగాహన సదస్సును నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూరగాయాల నర్సరీని పరిశీలించిన అనంతరం కలెక్టర్, రైతులకు సంకరజాతి కూరగాయల నాట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి లాభదాయక పంటలు సాగుచేయాలని అన్నారు. ఒకే పంటపై ఆధారపడకుండా బహుళ పంటల సాగు విధానాన్ని అనుసరించాలని సూచించారు. ఇది వాతావరణ మార్పులు, పంట నష్టాల నుంచి రక్షణ కల్పించడమే కాకుండా స్థిరమైన ఆదాయాన్ని అందిస్తుందని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు, సంకరజాతి కూరగాయల విస్తరణ పథకాలు రైతులకు లాభదాయక అవకాశాలను అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆధునిక వ్యవసాయ పద్ధతుల అమలుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుల ఆదాయాన్ని పెంచే పంటలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆయిల్ పామ్ పంటలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, రైతులకు సబ్సిడీ అందుబాటులో ఉందని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో ఈ పంటలకు ప్రభుత్వం నిరంతర ప్రోత్సాహం అందించనున్నట్లు వెల్లడించారు. ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతులు, కొత్త సైన్స్ ప్రాజెక్టులను జిల్లాకు తీసుకురావడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి నర్సయ్య, అధికారులు, నర్సరీ యజమానులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పనులపై సమీక్ష

ఆదిలాబాద్ టౌన్: ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ అర్బన్, రూరల్, మావల, ఇచ్చోడ మండలాల్లోని పాఠశాలల్లో జరుగుతున్న మౌలిక వసతుల పనులపై ఆయన మొదటి దశ సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో విద్యుత్ కనెక్షన్లు, తాగునీరు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, ఎల్‌పీజీ కనెక్షన్లు, ప్రహరీ గోడలు, పెండింగ్ పనులు, తరగతి గదుల మరమ్మతులు, తదితర అంశాల పురోగతిని పాఠశాలల వారీగా కలెక్టర్ సమీక్షించారు. పాఠశాలల్లో సమగ్ర మౌలిక సదుపాయాలు ఉండడం విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాల పెరుగుదలకు కీలకమని పేర్కొన్నారు. ఇప్పటికే అనేక పనులకు నిధులు విడుదలైనందున వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంఈవోలు, హెడ్ మాస్టర్లు, ఇంజినీరింగ్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తే నిర్ణీత గడువులో పూర్తవుతాయని తెలిపారు. సమావేశంలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యువరాజ్ మర్మాట్, అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు, కోఆర్డినేటర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు అనుమతి ఇవ్వండి

» సభాస్థలిని పరిశీలించిన ఆదివాసీ ప్రతినిధులు

ఉట్నూర్, నవంబర్11 (ఆంధ్రజ్యోతి): హాలో ఆదివాసీ చలో ఉట్నూర్ ధర్మ యుద్ధ బహిరంగ సభను ఈ నెల 23న ఉట్నూర్‌లో నిర్వహిస్తున్నందున పోలీసుల శాఖ అనుమతులు ఇవ్వాలని కోరుతూ తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సెడ్మకి రామారావులు అధికారులను కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో ఎస్సై ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.

బహిరంగ సభ సభాస్థలి పరిశీల

తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఈనెల 23న ఉట్నూర్‌లోని నిర్వహించనున్న ధర్మయుద్ధం సభాస్థలిని ఆదివాసీ ప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పెందూర్‌దాదిరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా



ఉట్నూర్‌లో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ ప్రతినిధులు

అధ్యక్షుడు సెడ్మకి రామారావులు మాట్లాడుతూ చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్న డిమాండ్‌తో బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజనులు భారీ సంఖ్యలో ప్రతి ఇంటి నుంచి తరలిస్తున్నందున ఈ సభను విజయవంతం చేసి ప్రభుత్వానికి ఆదివాసీ గిరిజనుల డిమాండ్ తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో రాయిసిడం జంగు పటేల్, కుమ్మరం శత్రుఘాన్షావ్, పూసం ఇస్రులు పాల్గొన్నారు.

సభకు తరలి రావాలి

నార్నూర్: ఈనెల 23న ఉట్నూర్ ఎంపీడీవో గ్రౌండ్‌లో తలపెట్టిన ధర్మ యుద్ధ సభను ఆదివాసులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందుర్ దాదిరావ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఆదివాసీ సంఘ నాయకులతో కలిసి సభకు సంబంధించిన గోడ పత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ లంబాడలను తక్షణం ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

సంక్షేమానికి.. బ్రేక్!

(5వ పేజీ తరువాయి...)

వినిపిస్తున్నాయి. గత ఐదు మాసాల క్రితం ఎంతో హడావిడిగా లబ్ధిదారులను ఎంపిక చేసినా.. అమలుకు నోచుకోక పోవడంతో అర్హులైన లబ్ధిదారులు ఆశలు వదిలేసుకుంటున్నారు. 2025 ఏప్రిల్ 6న విధి విధానాలను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకాన్ని ప్రారంభించింది. దీంతో ఎందరో మంది నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లా టార్గెట్ 12,580గా ప్రభుత్వం నిర్ణయించింది. కాగా గడువు సమయం ముగిసేసరికి 47,806 దరఖాస్తులు వచ్చినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. ఈ పథకాన్ని అమలు చేస్తే ఎందరో మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు దక్కుతాయి. ఎంపికైన వారికి ఆర్థిక సహాయం అందించే విధంగా రూ.50 వేల నుంచి రూ.4లక్షల వరకు రుణ మొత్తాన్ని మంజూరు చేయాలని నిర్ణయించారు. అలాగే రుణాలపై 60 శాతం నుంచి 80 శాతం వరకు సబ్సిడీని అందిస్తూ ఈ పథకం ద్వారా యువతను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్లింది. కానీ ఐదు నెలలు గడుస్తున్నా.. ఆచరణ సాధ్యం కాకపోవడంతో అర్హులైన లబ్ధిదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. దీనిపై అధికారులకు కూడా స్పష్టత లేకపోవడంతో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి.

'ఆసరా'కు ఆన్‌లైన్ తిప్పలు

గత ఆరేళ్లుగా ఆసరా పథకానికి ఆన్‌లైన్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ఎందరో మంది నిరుపేద లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆసరా పథకం పేరు మార్చి కొత్తగా చేయూత అనే పేరు పెట్టింది. కానీ పథకం అమలును విస్మరించడంతో ప్రభుత్వ లక్ష్యం నేరవేరడం లేదు. చేయూత పథకం ద్వారా వృద్ధులు, బీడీ కార్మికులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులకు అందిస్తున్న రూ.2016 పింఛన్‌ను రూ.4వేలకు పెంచుతామని హామీ ఇచ్చినా.. ఇప్పటి వరకు అమలుకు నోచుకోవడం లేదు. ఏళ్ల తరబడి ఆన్‌లైన్ సేవలను నిలిపివేయడంతో దరఖాస్తు చేసుకునేందుకు కూడా అవకాశమే లేకుండా పోయింది. ముఖ్యంగా భర్తను కోల్పోయిన వితంతువులకు కూడా ఆసరా పింఛన్లు అందడం లేదు. ప్రస్తుతం జిల్లాలో 72వేల వరకు ఆసరా పింఛన్లను అందిస్తున్నారు. మరో 10వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. కాలం గడుపుతున్నారే తప్ప అర్హులైన వారికి వెంటనే పింఛన్లను మంజూరు చేయడం లేదని లబ్ధిదారులు మండిపడుతున్నారు. కుటుంబ పెద్దదిక్కును కోల్పోయిన వితంతు మహిళల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది.

ఊరిస్తున్న సంక్షేమ పథకాలు

ప్రభుత్వ ప్రకటనతో పలు సంక్షేమ పథకాలు లబ్ధిదారులను ఊరిస్తున్నాయి. ఆరు గ్యారంటీల మాట దేవుడెరుగు గాని కనీసం ఆసరా పింఛన్‌లు కూడా వచ్చే పరిస్థితి లేదని మండిపడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా.. సమాధానం చెప్పలేక అధికారులు తప్పించుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామాలు, మున్సిపాలిటీల్లో ప్రజాప్రతినిధులు కూడా లేకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితుల్లో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. సంక్షేమ పథకాలను మంజూరు చేయిస్తామని కొంత మంది చోటామోటా నేతలు లబ్ధిదారుల నుంచి అందిన కాడికి దండుకుంటున్నారు. పథకాలు ఎప్పుడొస్తాయని? అడిగితే ఇదిగో అదిగో అంటూ తీవ్ర కాలయాపన చేస్తున్నారు. పలుమార్లు అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. ఫలితం లేకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజాఫిర్యాదుల విభాగంలో ఎక్కువగా సంక్షేమ పథకాలకు సంబంధించిన దరఖాస్తులే రావడం గమనార్హం.

14 నుంచి వాలీబాల్ పోటీలు

బోథ్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాట్నాపూర్ గ్రామంలో బీర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకుని వాలీబాల్ పోటలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలలో బోథ్, సోనాల, బజార్హత్నూర్, నేరడిగొండ మండలాల క్రీడాకారులకు పోటీలలో పాల్గొని అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పోటీలలో పాల్గొనే వారు ఈనెల 13లోపు రూ.200 ఎంట్రీ ఫీజుగా చెల్లించి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. మొదటి బహుమతిగా రూ.5వేలు ద్వితీయ బహుమతిగా రూ.2వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. క్రీడాకారులు ఎవరి బాలు వారే తీసుకుని రావాలని కోరారు.

రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

» రాష్ట్ర మాజీ మంత్రి జోగురామన్న

జైనథ్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో పత్తి పంట నష్టపోయిన రైతు కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన హెడావ్‌దీపక్ పత్తి షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం కావడంతో బాధిత రైతును మాజీ మంత్రి జోగురామన్న మంగళవారం పరామర్శించారు. ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానం ప్రవేశపెట్టిన కారణంగా వారం రోజులపాటు 50క్వింటాళ్ల పత్తి ఇంట్లోనే ఉండి పోయిందన్నారు. దీంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో 50క్వింటాళ్ల పత్తిపంట విద్యుత్ ప్రమాదానికి కాలి బూడిద అయిందన్నారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ తక్షనం స్పందంచి లక్ష్మీపూర్ పత్తి రైతును ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జైనథ్ మాజీ ఎంపీపీ ఎం.గోవర్దన్, బీఆర్ఎస్ జిల్లా పార్టీ సీనియర్ నాయకులు ఎస్. లింగారెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పి.గణేష్‌యాదవ్, తదితరులు ఉన్నారు.

రైతును పరామర్శించిన డీసీసీబీ చైర్మన్

మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన రైతు హెడావ్ దీపక్ సాగు సంబంధించిన 50 క్వింటాళ్ల పత్తి షార్ట్‌సర్క్యూట్‌తో సోమవారం రాత్రి ఇంట్లో దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ అడ్డిభోజారెడ్డి మంగళవారం రైతు హెడావ్ దీపక్ ఇంటిని పరిశీలించి ధైర్యం చెప్పారు. పత్తి రైతు కుటుంబాన్ని ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, లక్ష్మీపూర్ గ్రామ రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



రైతుతో మాట్లాడుతున్న తహసీల్దార్

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

కుంటాల, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): కుంటాల మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ కమల్‌సింగ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన అన్ని వసతులను కల్పించాలని స్థానిక సిబ్బందికి సూచించారు. కేంద్రాలలో షామియానాలు, రైతులకు తాగునీరు అవసరం మేర పారీలు, గన్నీ బస్తాలు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు సరైన తేమ శాతంతో కూడిన ధాన్యాన్ని తీసుకువచ్చి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని అన్నారు. ఆయనవెంట ఆర్ఐ రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

ప్రతీ పాఠశాలలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలి

బోథ్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుచ్లాపూర్ గన్నూర్ గ్రామాలలో పాఠశాలలను మండల అభివృద్ధి అధికారి రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రీ పాఠశాలలో సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని సూచించారు. అంతేకాక పారిశుధ్యం మెరుగుపర్చి మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని మధ్యాహ్న భోజన కార్మికులకు సూచించారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమం కింద పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించి పరిశుభ్రమైన వాతావరణంలో వంటలు వండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో రాజ్‌కుమార్, ఈసీ మధుకర్, పంచాయతీ కార్యదర్శులు అశోక్‌కుమార్, శిరీషా, టీఏఎఫ్ఏలు ఉన్నారు.



సారంగాపూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్



అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి

సారంగాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మౌలానా అబుల్ కలాం అజాద్ జీవితాన్ని మార్గదర్శకంగా తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం చించోలి(బి) గ్రామ సమీపంలో గల తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాలలో భారతదేశం తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతిని ఘనంగా నిర్వహించి జాతీయ విద్యా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్‌కు విద్యార్థులు పుష్పగుచ్ఛం అందజేసి, బ్యాండ్ మేళాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మౌలానా అబుల్‌కలాం ఆజాద్ స్వాతంత్ర్య సమరయోధులలో ముందువరుసలో నిలిచి, దేశ స్వాతంత్ర్యం కోసం ఉద్యమాలు చేశారని అన్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని అన్నారు. విద్య కొద్ది మందికి అందుబాటులో ఉన్న సమయంలో మౌలానా ఆజాద్ దేశంలో విద్యావ్యాప్తి, సమాన అవకాశాల కోసం నిరంతరం కృషి చేశారని వివరించారు. ఈ జయంతిని మైనారిటీ సంక్షేమ దినోత్సవంగా కూడా జరుపుకుంటామని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్‌సింగ్, తహసీల్దార్ రాజు, సంధ్యారాణి, కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్స్ రహత్, నాజ్నీమ్, సుజాత రాథోడ్, ఆయా శాఖల అధికాయులు, మైనార్టీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఆజాద్ జయంతి వేడుకలు

నిర్మల్ చైన్‌గేట్: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం భారతదేశ తొలి విద్యాశాఖమంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం



మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఆజాద్ జయంతిని ప్రతీ ఏడాది జాతీయ విద్యాదినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన విశిష్టపాత్రను వివరించారు. స్వాతంత్ర్యం అనంతరం భారతతొలి విద్యాశాఖ మంత్రిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. విద్యారంగ అభివృద్ధికి నిరంతరం శ్రమించి, అనేక సంస్కరణలను తీసుకువచ్చారని పేర్కొన్నారు. మైనారిటీల విద్యా అభివృద్ధి, మహిళా విద్యా ప్రోత్సాహానికి ఆయన చూపిన కృషి ఎంతో విలువైనదని తెలిపారు. యువత ఆయన ఆలోచనలను, విలువలను అనుసరించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, మైనార్టీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, మైనార్టీ సంఘాల నాయకులు, ఇతర అధికారులు, పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో..

ఖానాపూర్: భారతదేశంలో విద్యారంగ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన కృషి ఎనలేనిదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మంగళవారం ఖానాపూర్‌లోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారతతొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశంలో విద్యా రంగాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, జామ మస్జిద్ అధ్యక్షులు జహీర్ అహ్మద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు షౌకత్ పాషా, ముషీర్, బి. గోవింద్, రహిల్, జహీర్ భాయ్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అహ్మద్, తదితరులున్నారు.

భైంసాలో..

భైంసా: పట్టణంలోని మౌలానా అబుల్ కలాం చౌక్‌లో మంగళవారం స్వతంత్ర్య భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం అజాద్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అబుల్ కలాం చౌక్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో హబీబీ మిల్లతే యూత్ వెల్ఫేర్ అధ్యక్షుడు షేక్ ఖదీర్, ఉపాధ్యక్షుడు సల్మాన్ హైమద్‌తోపాటు పలువురు ప్రతినిధులు అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశ విద్యా విధానంలో సమూల మార్పులు, సంస్కరణ తెచ్చారన్నారు. అబుల్ కలాం జయంతిని విద్యార్థి దినోత్సవంగా, మైనార్టీ వెల్ఫేర్ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న జూనియర్ వెటర్నరీ అధికారి

పెంచికల్‌పాడ్‌లో పశువైద్య శిబిరం

కుంటాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో మంగళవారం జూనియర్ వెటర్నరీ అధికారి శశింధర్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా 428 పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, ఇందులో భాగంగానే పశువులకు ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా గాలికుంటు టీకాలను ఉచితంగా వేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రామంలో ఇంకా ఎవరైనా పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేయకుంటే తమకు సమాచారం అందిస్తే వాటికి కూడా టీకాలు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు నాగభూషణ్, లింగన్న, శ్రీధర్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

» నిర్మల్ జిల్లా డీఈవో భోజన్న

తానూర్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం తానూర్‌లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం డీఈవో భోజన్న సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతోమాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివి పాఠశాల విద్యార్థులు వంశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులు ప్రత్యేక తరగతులకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. దీంతో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులు ప్రతీ రోజు పాఠశాలకు రావడంతో హాజరు శాతం పెరుగుతుందని, మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈయనవెంట ఉపాధ్యాయులు లింబాద్రి, పాఠశాల హెచ్ఎం సాయిబాబా ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

సెల్‌ఫోన్ పోయిన,చోరీకి గురైన
ఆందోళన చెందొద్దు

- మొబైల్ ఫోన్ పోయిన, చోరీకి గురైన సీఈఐఆర్‌లో రిజిస్టర్ చేసుకోవాలి
- జిల్లా పరిధిలో పోగొట్టుకున్న, చోరీకి గురైన 71 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేత
- సెకండ్ హ్యాండ్ మొబైల్స్‌లో చోరీ ముఠాలను గుర్తించాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశం

నిర్మల్‌చైన్‌గేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశానుసారంగా, నిర్మల్ పోలీసులు మొబైల్ దొంగతనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సీఈఐఆర్ పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగించారు. నెలరోజుల్లో 71 మొబైల్ ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. సెల్‌ఫోన్ పోయిన,చోరీకి గురైన ఆందోళన చెందొద్దని సీఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోగొట్టుకున్న, చోరీకి గురైన 71 మొబైల్ ఫోన్లు (ఎనిమిది లక్షల యాభై రెండు వలే విలువ గల ఫోన్లను) స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. మొబైల్ వినియోగదారులను అప్రమత్తంగా ఉండాలన్నారు. పోయిన సెల్‌ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి సీఈఐఆర్ వెబ్‌సైట్ ఎంతో ఉపయోగపడు తుందని తెలిపారు. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో వినియోగదారులు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో వారి వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్స్‌ని ఈపోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1806 ఫోన్లు (సుమారు రెండు కోట్ల పదహారు లక్షల డెబ్బై రెండు వేల రూపాయల విలువ గల ఫోన్లను) రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందన్నారు. సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ల కొనుగోలు, విక్రయాలపై కఠినంగా పర్యవేక్షణ చేయాలని సూచిం చారు. వినియోగదారులు సెకండ్ హ్యాండ్ మొబైల్స్ కొనే టప్పుడు అవి ఎక్కడి నుంచి వచ్చినవి, చోరీకి గురైనవో కాదో సరిచూసుకోవాలని, అనుమానం ఉన్న ఫోన్లను కొనరాదని తెలిపారు. అంతే కాకుండా ఒకే వ్యక్తి వద్ద లేదా కొద్ది మంది వద్ద పెద్ద సంఖ్యలో మొబైల్స్ దొరికితే, వారు ఏదైనా చోరీ ముఠా లేదా అనుమానాస్పద కార్యకలాపాలలో భాగమా అనే దానిపై సమగ్ర విచారణ చేయాలని అడిషనల్ ఎస్పీకి ప్రత్యేక సూచనలు ఇచ్చారు. సీఈఐఆర్ ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరికైనా సెల్ ఫోన్లు దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో గాని లేదా ఆ నెంబర్ వారికి ఫోన్ చేసి వారికి అప్పగించాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్లు రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటీ కోర్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

» నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల



బాధితులకు మొబైల్ ఫోన్లు అందజేస్తున్న జిల్లా ఎస్పీ జానకి షర్మిల

ఈకేవైసీ ఉంటేనే గ్యాస్ రాయితీ

» ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఒకసారి తప్పనిసరి


వినియోగదారుడికి ఈ-కేవైసీ చేస్తున్న మేనేజర్

భైంసా,నవంబరు11(ఆంధ్రజ్యోతి):రాయితీపై అందిస్తోన్న గ్యాస్‌సిలిండర్ల దుర్వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని అనుసరిస్తోంది.ఎల్పీజీ వినియోగదారులు ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఒక సారి ఈ-కేవైసీ చేయించుకోవడం తప్పనిసరి చేసింది. వినియోగదారులు తాము వినియోగించే గ్యాస్ కంపెనీ (హెచ్‌పీ, ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం)తదితర మొబైల్‌యాప్ ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంటుంది.

ఏం చేయాలంటే

వినియోగదారులంతా ఏజెన్సీ కార్యాలయంలో ఈ ప్రక్రియ పూర్తి చేయించుకోవచ్చు. లేదంటే డెలివరీ బాయ్‌ల ఫోన్లలో ఉండే యాప్ ద్వారానూ పూర్తి చేసుకోవచ్చు. మూడు నెలలుగా రాయితీ విడుదలలో జాప్యం జరుగుతోంది. దీనికి ప్రధాన కారణం ఈ-కేవైసీ చేయించుకోకపోవడమే.

తప్పించుకోవొద్దు

ఏడాదికి గరిష్ఠంగా 9సిలిండర్లకు మాత్రమే కేంద్రం సబ్సిడీ ఇస్తోంది. 8,9వ సిలిండర్లు పొందే ముందే ధ్రువీకరణ పూర్తిచేసుకోకపోతే రాయితీని తాత్కలికంగా నిలిపివేస్తారు. ఆర్థిక సంవత్సరం ముగిసే మార్చి 31లోపు ఈ-కేవైసీ చేయించుకుంటే తిరిగి చెల్లిస్తారు. లేదంటే శాశ్వతంగా రద్దవుతోంది. ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఒక సారి ఇది తప్పనిసరి.

జిల్లాలో ఇలా..

నిర్మల్ జిల్లాలోని ముథోల్, నిర్మల్, ఖానాపూర్ నియోజకవర్గాల పరిధిలో 2,51,785 వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో దీపం 47,215, ఉజ్వల 37,249, సాధారణ 1,39,430, సీఎస్ఆర్ 26,828, ఇతర 1069 ఉన్నాయి. అయితే 8, 9వ సిలిండర్లు పొందిన తర్వాత చాలా మంది ఈ-కేవైసీ చేయించుకోకపోవడంతో సబ్సిడీ జమ కావడం లేదని గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు చెబుతున్నారు.

చలికాలం.. ఆరుబయటే చదువులు


ముత్నూర్‌లో విద్యార్థులకు బోధిస్తున్న అధ్యాపకురాలు

సిరికొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చలికాలం దృష్ట్యా బయటకు వెళ్లాలంటే జనం జంకుతున్నారు. జిల్లాలో రోజు రోజుకు చలితీవ్రత అధికమవడంతో సాయంత్రం మొదలుకుని ఉదయం 10గంటల వరకు బయటకు రాలేక జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వృద్ధులు, చిన్నారులు, చలికి గజ గజ వణికిపోతున్నారు. దీంతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పే పరిస్థితి లేక పోవడంతో ఉపాధ్యాయులు అన్ని తరగతులు ఆరుబయటే నిర్వహిస్తున్నారు.

వామ్మో..చలి..!


మార్నింగ్‌వాక్ చేస్తున్న దృశ్యం




» రోజురోజుకు పడిపోతున్న ఉష్ణోగ్రతలు » చలికి జంకుతున్న జనం

ఆదిలాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో ఏ నోటా విన్నా వామ్మో చలి.. చలిగా ఉంది అనే మాటలే వినిపిస్తున్నాయి. గత నాలుగైదు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోవడంతో చలి తీవ్రత కనిపిస్తుంది. గరిష్ట ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు లేక పోయిన కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి.మంగళవారం జిల్లా సగటు గరిష్ట ఉష్ణోగ్రత 29.3 కాగా కనిష్టంగా 11.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.అత్యల్పంగా బజార్‌హత్నూర్ మండలంలో 10.2, సాత్నాలలో 10.4, బోథ్ మండలం పొచ్చెరలో 10.5, నేరడిగొండలో 10.7, బేలలో 11.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 20.0 డిగ్రీల లోపే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోజు రోజుకు పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలతో పగలు రాత్రి అనే తేడా లేకుండా చలి ప్రభావం కనిపిస్తుంది.ఉదయం రాత్రి చలితో జనం వణికి పోతున్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లోనైతే చలిప్రభావం మరింత ఎక్కువగా కనిపిస్తుంది. చలి మంటలు వేసుకుంటు వెచ్చదనాన్ని పొందుతున్నారు. సాయంత్రం పనులు ముగించుకుని 6గంటలకే ఇంటికి పరిమితమవుతున్నారు.నవంబరు 19 వరకు కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా సూచించారు. ఉదయం రాత్రి వేళల్లో అత్యవసరమైతేనే ప్రజలు బయటకు వెళ్లాలని అధికారులు పేర్కొంటున్నారు.

ఇచ్చోడ: రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో చలి తీవ్రత పెరుగుతోంది. సాయంత్రం 5గంటలకే శీతల గాలులు వీస్తున్నాయి. ఉదయం ఎనిమిది దాటినా వణుకు తగ్గడంలేదు. రెండు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా శ్వాసకోస వ్యాధిగ్రస్తులు ఇళ్ల నంచి బయటికి రావాలంటేనే భయపడతున్నారు. ఉదయం పూట కూర గాయాలు, పాలు తది తర పనులు చేసుకునే వారు చలికి తట్టుకోకపో వడంతో రోడ్డు పక్కన మంటలు కాగి ఉపశమనం పొందుతున్నారు. సాయంత్రం బయటికి వెళ్లాలంటే వెన్నులో వణుకు పడుతుందని ప్రజలు జంకుతున్నారు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో స్వీయ రక్షణ చర్యలు తీసుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.


చలిమంట కాస్తున్న యువకులు


టీని తాగుతున్న మార్నింగ్ వాకర్స్


కమ్ముకున్న పొగమంచులో..

ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ సుడిగాలి పర్యటన

ఉట్నూర్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ మంగళవారం ఉట్నూర్ మండలంలోని సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మండలంలో పర్యటించి వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు. ఉదయం లేవగానే మండల కేంద్రంలో మార్నింగ్ వాక్ చేస్తూ (పొద్దు పొడుపు బొజ్జన్న అడుగు)పేరుతో మార్నింగ్ వాక్ నిర్వహించారు. సుభాష్‌నగర్, సేవదాస్‌నగర్, పొచమ్మగల్లీ, ఫకీర్‌గుట్ట, మెయిన్‌రోడ్‌లోని ప్రజలతో ముచ్చటిస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు. సమస్య ఉన్న చోట వెంట ఉన్న అధికారులను సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. పర్యటనలో ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. మురికి కాలువల సమస్యకు పరిష్కారం దిశగా ప్రణాళిక చేశారు. అవసరం ఉన్న చోట ట్రాన్స్‌ఫార్మర్లు, నూతన వాటర్ ట్యాంక్స్, అంగడి బజార్, ఐబీ ప్రాంతాల్లో సులబ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం కోసం స్థలాలు పరిశీలించారు.వాకింగ్‌లో భాగంగా మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. మెస్, వసతి, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.,

రైతుల ప్రయోజనం కోసం కొనుగోలు కేంద్రాలు

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తున్నందున కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ అన్నారు. మండలంలోని షాంపూర్ దాల్మిల్ వద్ద మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రజామిత్ర సహకార సంస్థ ద్వారా సోయాబీన్, మొక్కజోన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సోయాబీన్ క్వింటాల్ ధర రూ.5328 మొక్కజోన్న క్వింటాల్ ధర రూ.2400లకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఉట్నూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలోని శాంతినగర్ గ్రామైక్య సంఘంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, వైస్ చైర్మన్ జయవంతరావు, డీసీసీబీ డైరెక్టర్ సామ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రాథోడ్ రవీందర్, ఏపీడీ గోవిందరావు, ఏపీఓ రామారావు, ఆర్డీఏ జిల్లా సభ్యులు దూట రాజేశ్వర్, గట్టురమేష్, ప్రజామిత్ర సహకార సంస్థ మేనేజర్లు రాథోడ్‌శేషారావు, కుమ్ర విఠల్‌రావు, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఏఓ రమేష్, దాసండ్ల ప్రభాకర్, ఇక్బాల్, చంద్రయ్య, నందంసాడిగే రాజేశ్వర్, అజీముద్దిన్ తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే


ఫాస్టాగ్‌ను మూసి వేయించిన ఎమ్మెల్యే బొజ్జుపటేల్

చింతగూడ వంతెన పనుల పరిశీలన

మండలంలోని ఘన్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఎమ్మెల్యే స్వగ్రామం కల్లూరుగూడకు నిర్మిస్తున్న రోడ్డు పనులను ఎమ్మెల్యే స్వయంగా మంగళవారం పరిశీలించారు. చింతగూడ చెరువుపై నిర్మిస్తున్న భారీ వంతెన పనులు రోడ్డు భవనాలశాఖ అధికారుల ఆధ్వర్యంలో పరిశీలించారు.

అటవీ శాఖ చెక్‌పోస్టు వద్ద ఫాస్టాగ్ ఏర్పాటు పట్ల ఎమ్మెల్యే ఆగ్రహం - తక్షణమే మూసివేసిన అధికారులు

ఉమ్మడి జిల్లాలోని కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో ఉన్న కొత్తగూడెం అటవి శాఖ చెక్‌పోస్టు వద్ద అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఫాస్టాగ్ ఏర్పాటు పట్ల ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలో వివిధ ప్రారంభోత్సవాలు నిర్వహించుకుని తిరిగి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వస్తుండగా కొత్తగూడ చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన ఫాస్టాగ్‌ను వెంటనే మూసి వేయాలని అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి ఫోన్ ద్వారా ఎఫ్డీపీటీ శాంతారామ్, ఆదిలాబాద్ డీఎఫ్‌ఓలతో ఫోన్లో మాట్లాడి తనకు తెలియకుండా తన నియోజకవర్గంలో ఫాస్టాగ్‌ను ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. తాను రాష్ట్ర వన్యప్రాణి విభాగం సభ్యుడిగా ఉన్నానని, ఎమ్మెల్యేగా ఉన్నాని తన పరిధిలోని ఎనిమిది మండలాల ప్రజలకు ఎలాంటి వాహనాల రుసుము లేకుండా అన్ని వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్లు సేకరించి వాటికి ఫాస్టాగ్‌లో డబ్బులు కట్‌కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీసీసీఎఫ్, అటవీశాఖ మంత్రి కొండ సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లికృష్ణారావుల దృష్టికి తీసుకు వెళ్లి అటవీశాఖ అధికారుల పనితీరు తెలపడం జరుగుతుందన్నారు. కొత్తగూడచెక్‌పోస్టు వద్ద అక్రమంగా ఫాస్టాగ్ ఏర్పాటు చేశారని ఆరోపించారు. కవ్వాల్‌టైగర్‌జోన్ పరిధిలో ఫాస్టాగ్ ఏర్పాటు చేయడం తప్పుకాదని ఖానాపూర్ నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో ఉన్నవాహనాలను లోకల్‌గాపరిగణించి రుసుము మినహాయింపు ఇవ్వాలన్నారు.

వెంటనే మూతపబడ్డ ఫాస్టాగ్...

ఖానాపూర్ ఎమ్మెల్యే చెక్‌పోస్టు వద్ద నుంచి ప్రయాణించగానే అటవీ శాఖ అధికారులు ఫాస్టాగ్‌ను మూసివేవారు. జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో ఫాస్టాగ్ మూసి వేస్తున్నట్లు ఉద్యోగులు తెలిపారు. కొత్తగూడ చెక్‌పోస్టు వద్ద ఫాస్టాగ్ మూసి వేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

క్రైం సమాచారం

గుడుంబా స్థావరంపై పోలీసుల దాడి

» గాదిగూడ మండలంలో ఇద్దరిపై కేసు నమోదు



గుడుంబా తయారుదారులను అదుపులో తీసుకున్న ఎస్సై

నార్నూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ప్రాంతంలోని నార్నూర్, గాదిగుడ మండలాల్లో గుడుంబా తయారిపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'గప్పు మంటున్న గుడుంబా' అనే శీర్షిక ప్రచురితమైంది. స్పందించిన పోలీసులు గాదిగూడ మండలంలోని చిత్తగూడ గ్రామ శివారు ప్రాంతం గుడుంబా స్థావరాలపై దాడి చేశారు. ఆత్రం పగ్గు(71), ఆత్రం ముత్తా (37)ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఆరు లీటర్ల సారా, పది కిలో ఇప్పపువ్వు స్వాధీనం చేసుకున్నట్లు గాదిగూడ ఎస్సై ప్రణయ్‌కుమార్ తెలిపారు. ఆదివాసీ ప్రాంతంలో పోలీసుల పనితీరు బేస్ ఉందంటూ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ పనితీరుపై అసంతృప్తిగా ఉన్నారు.

గిరిజన గురుకుల విద్యార్థి అదృశ్యం

ఇచ్చోడ, నవంబరు, 11 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల నుంచి ఈనెల 6వ తేదీన పదో తరగతి విద్యార్థి అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈవిషయమై పాఠశాల ప్రిన్సిపల్ కిషన్ చౌహన్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..పదో తరగతి విద్యార్థి అనికేష్ మధ్యాహ్న భోజన అనంతరం పాఠశాల నుంచి బయటికి వెళ్లాడు. గమనించిన పాఠశాల సిబ్బంది విద్యార్థి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో మరుసటి రోజు విద్యార్థి బంధువుల ఇంటికి, తెలిసిన వారి ఇంటికి వెళ్లాడేమెనని ఆరాతీశారు. దీంతో ఎంత వెతికిన అచూకీ తెలియకపోవడంతో ఈనెల 8వ తేదీన పోలీసులకు పాఠశాల సిబ్బంది ఫిర్యాదు చేశారు. ఈ విషయం వాట్సాప్ గ్రూప్‌లలో నార్నూర్ మండలానికి చెందిన బాలుడి అచూకీ తెలిస్తే సంప్రదించండి అంటూ సోషల్ మిడియాలో వచ్చిన సమాచారంతో విషయం బయటకు వచ్చింది. ఇప్పటికీ బాలుడి ఆచూకి తెలియరాలేదు.

వేణునగర్ అంగన్‌వాడీ టీచర్‌పై విచారణ

పెంబి,నవంబరు11(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని వేణునగర్ గ్రామంలోని అంగన్‌వాడీ టీచర్ నిర్లక్ష్యంతో ఈ నెల 1న ఇందిరమ్మ ఇంటినిర్మాణం పిల్లర్ గుంతలోపడి ఆత్రం పుష్పమృతి చెందినవిషయం తెలిసిందే. గత నాలుగు రోజుల క్రితం కలెక్టర్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్ నిర్లక్ష్యం తోనే అంగన్‌వాడీ చిన్నారి పుష్ప మృతి చెందిందని వేణునగర్ గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుంచి అధికారులు వచ్చి విచారణ చేపట్టారు. జరిగిన విచారణపై అధికారులకు అందిస్తామని తెలిపారు.



వేణునగర్‌లో విచారణ చేపడుతున్న అధికారులు

బిడ్డకు జన్మనిచ్చి ఫిట్స్‌తో తల్లి మృతి

బోథ్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):బోథ్ మండల కేంద్రానికి చెందిన హర్ష అపూర్వ అనే యువతి (25) పండంటి బిడ్డకు జన్మనిచ్చి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో మృతి చెందింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన హర్ష విజయేందర్ భార్య అయిన అపూర్వ మొదటి కాన్పులోనే పండంటి కుమారునికి జన్మనిచ్చి హైదరాబాద్ ఆసుపత్రిలో ఫిట్స్ వ్యాధి భారీన పడి సోమవారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.అయితే డెలివరీ నిమిత్తం వెళ్లిన ఈమె మృతి చెందడంతో కాలనీలో బంధువులలో విషాదఛాయలు అలుముకున్నాయి. మంగళవారం ఆమె స్వగ్రామమైన బోత్‌లో అంత్యక్రియలు నిర్వహించారు.

మహిళా మృతికి కారణమైన వ్యక్తికి రిమాండ్



బజార్‌హత్నూర్‌లో నిందితుడి వివరాలను తెలియజేస్తున్న సీఐ, ఎస్సై

బజార్‌హత్నూర్,నవంబరు11 (ఆంధ్రజ్యోతి): బజార్‌హత్నూర్ మండల కేంద్రం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందిన ఘటనలో నిందితుడిని ఆరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు బోథ్ సీఐ గురుస్వామి తెలిపారు. కాగా పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై సంజయ్ కుమార్‌తో కలిసి సంఘటన వివరాలను తెలిపారు. నవంబరు 9న బజార్‌హత్నూర్ గ్రామానికి చెందిన చెవుల రత్నమాల తన కుమారుడు చెవుల లక్ష్మణ్‌తో కలిసి వ్యవసాయ పనులు ముగించుకొని ఎడ్ల బండిపై ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన తర్లపు ప్రదీప్ అనే కారుతో మద్యం మత్తులో అత్యంత నిర్లక్ష్యం, వేగంగా నడుపుతూ ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో చెవుల రత్నమాల తలకు గాయమై తీవ్రరక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందింది. కుమారుడు గాయలతో బయటపడ్డాడన్నారు. పూర్తి దర్యాప్తు చేపట్టగా నిందితుడు మద్యం తాగి వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. మద్యం తాగి నడిపడం ప్రాణాంతకమని, ఇలాంటి నిర్లక్ష్యపు చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. వారితో బోథ్ ఎస్సైసాయి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పీవీటీజీ ఇళ్ల నిర్మాణంలో అన్యాయం



అటవీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సంఘ నేతలు

ఆదిలాబాద్‌టౌన్,నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న కొలాంలకు పీఎం జన్మన్ పథకం కింద నిర్మిస్తున్న పీవీటీజీ ఇళ్ల నిర్మాణంలో అన్యాయం జరుగుతోం దని ఆదిమ గిరిజన కొలాం సేవ సంఘం నేతలు అన్నారు. ఈ విషయమై తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని అటవీ శాఖ కార్యాల యం ఎదుట ధర్నా నిర్వహించారు. తమకు రావాల్సిన పీవీటీజీ ఇండ్లతో పాటు సౌకర్యాల కల్పనలో అటవీ అధికారులు అన్యాయం చేస్తున్నారని అన్నారు. పీవీటీజీ ఇళ్ల నిర్మాణంలో అడ్డు పడుతు న్నారని ఆరోపించారు. వెంటనే అధికా రులు స్పందించి తమ సమస్యను పరి ష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొడప సోనేరావు, ఉపాధ్యక్షుడు కుమ్ర రాజు, జిల్లా అధ్యక్షుడు మడావి గోవింద్‌రావు, వివిధ గ్రామపటేళ్ల తదితరులు పాల్గొన్నారు.





ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణలో మాట్లాడుతున్న జగదీప్‌సింగ్

ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు ఎన్‌సీసీ తోడ్పాటు

» 32 బెటాలియన్ సుబేదార్ జగదీప్ సింగ్

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు ఎన్‌సీసీ శిక్షణ ఎంతో తోడ్పడుతుందని ఆదిలాబాద్ 32 బెటాలియన్ సుబేదార్ జగదీప్‌సింగ్ పేర్కొన్నారు. స్థానిక జుమ్మేరాత్‌పేట్ హైస్కూల్‌లో వారం రోజులు కొనసాగుతున్న ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని జుమ్మేరాత్‌పేట్ హైస్కూల్‌తోపాటు పోచంపాడ్, నర్సాపూర్ హైస్కూల్, రవి హైస్కూల్‌తోపాటు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఎన్‌సీసీ శిక్షణ పొందిన విద్యార్థులకు ఎంతో మెరుగైన భవిష్యత్తు ఉందన్నారు. ఉన్నత విద్యా అవకాశాలలోనే కాకుండా ఉపాధి అవకాశాలలో సైతం ఎన్‌సీసీ క్యాడర్లకు రిజర్వేషన్ సౌకర్యం ఉందని వివరించారు. ఐకమత్యం, క్రమశిక్షణ లక్ష్యంగా ఎన్‌సీసీ క్యాడెట్లు దేశవ్యాప్తంగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్నారన్నారు. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు నిర్వహిస్తున్న పాత్ర వెలకట్టలేనిదన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు అందిస్తున్న శిక్షణ వారికి భవిష్యత్తుతోనే కాకుండా దేశానికి సైతం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ కార్యక్రమాలలో హవల్దార్ దేవేంద్రసింగ్, హవల్దార్ నితేంద్ర సింగ్‌తో పాటు జుమ్మేరాత్‌పేట్ హైస్కూల్ హెడ్‌మాస్టర్ అల్లం రవిబాబుతోపాటు ఎన్‌సీసీ కేర్ టేకర్ ప్రసూయ, అడ్వైజర్ మొలంకల శ్రీనివాస్ పాల్గొన్నారు.



బీఎల్‌వోలతో సమావేశం నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ బాబుసింగ్

మ్యాపింగ్ డాటాను త్వరితగతిన పూర్తిచేయండి

లక్ష్మణచాంద, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాకు సంబంధించిన మ్యాపింగ్ డాటాను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ బాబు సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పోలింగ్ కేంద్ర అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. 2002 ఓటరు లిస్టుతో పోల్చుకుని మ్యాపింగ్ విధానంపై, కుటుంబ ఓటర్లను యాడ్ చేసే విధానంపై సవివరంగా వివరించారు. కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్లు నరేందర్, మహేందర్, నరేష్‌లు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ రాష్ట్రఉపాధ్యక్షుడిగా భూక్యా గోవింద్



భూక్యా గోవింద్

ఖానాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఖానాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న భూక్యా గోవింద్ ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని కాచిగూడ సంఘ భవనంలో నిర్వహించిన ఎస్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో తనను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు గోవింద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాబోయే రోజుల్లో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.



జల సంరక్షణలో భాగంగా నిర్మించిన ఓపెన్ వెల్



నీటి సంరక్షణలో ముందడుగు

- » జేఎస్‌జేబీ అమలులో నిర్మల్ జిల్లా టాప్
- » దక్షిణ భారతదేశంలో మొదటి ర్యాంకు
- » రూ.కోటి నజరానాకు ఎంపిక
- » జిల్లావ్యాప్తంగా 63,350 పనుల పూర్తి
- » జిల్లా అధికారులకు కేంద్ర జలశక్తి శాఖ ప్రశంసలు
- » ఈనెల 18న ఢిల్లీలో రివార్డు స్వీకరణ

నిర్మల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం చేపడుతున్న జల్ సంచయ్ మే జన్ భాగిదారి (జేఎస్‌జేబీ) కార్యక్రమం అమలులో నిర్మల్‌జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. దక్షిణ భారతదేశంలోనే ఈ పథకం కింద అత్యధిక పనులు పూర్తిచేసి జిల్లా యంత్రాంగం కేంద్ర సర్కారు ప్రశంసలను అందుకుంది. ఈ పథకం కింద సౌత్‌జోన్ పరిధిలో కేటగిరి-2 కింద జిల్లాకు రెండో ర్యాంకు దక్కింది. కాగా ఈనెల 18న పథకం అమలులో విశేషంగా కృషి చేసిన కలెక్టర్ అభిలాష అభినవ్ అలాగే డీఆర్‌డీవో పీడీ విజయలక్ష్మి ఈ అవార్డును అందుకోబోతున్నారు. ఈ అవార్డు కింద జిల్లాకు రూ.కోటి నగదు రివార్డు అందనుంది.

జిల్లా అధికారుల సమిష్టి కృషి

జల్ సంచయ్ మే జన్ భాగిదారి కార్యక్రమం అమలులో ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలు కూడా టాప్ పోజిషన్‌లో నిలిచి రూ.రెండు కోట్ల నగదు రివార్డుకు ఎంపికయ్యాయి. జిల్లాఅధికారుల సమిష్టి కృషి మేరకు వర్షపు నీటిని వృథా కానివ్వకుండా కాపాడడమే కాకుండా ఆ నీటిని సద్వినియోగం అయ్యేట్లు నిల్వ చేసే వనరులను సైతం జిల్లాలో ఏర్పాటు చేసుకున్నారు. ముఖ్యంగా ఉపాధిహామీ కింద జేఎస్‌జేబీ పనులన్నీ పూర్తయ్యాయి. ఈపథకం కింద ఓవైపు ఉపాధి జాబ్ కార్డుదారులందరికీ పనులు కల్పిస్తూనే సహజ వనరులైన వర్షపు నీటిని భద్రపర్చుకునే పథకాలను నిర్మించుకున్నారు. ఈ పథకాల ద్వారా ఓ వైపు భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతుండడమే కాకుండా ఆ నీటిని సాగునీటి అవసరాలకు, పశువులకు దాహార్తిని తీర్చేందుకు వినియోగిస్తున్నారు. బహుళ ప్రయోజనాలతో నిర్మించిన ఈనీటి పథకాల పనితీరును అలాగే వర్షపు నీటిని కాపాడేందుకు చేపట్టిన కృషికి కేంద్రప్రభుత్వం ప్రత్యేక గుర్తింపునివ్వడమే కాకుండా కోటి రూపాయల నగదు రివార్డుకు జిల్లాను ఎంపిక చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.

జిల్లాలో 63,350కి పైగా పనులు పూర్తి



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)

జిల్లాలో ఇప్పటివరకు డీఆర్‌డీవో ఆధ్వర్యంలో జల సంరక్షణకు సంబంధించిన 63,350కి పైగా పనులను రికార్డుస్థాయిలో పూర్తిచేసి ఇక్కడి అధికార యంత్రాంగం కేంద్ర సర్కారు ప్రశంసలు అందుకుంది. జల్ సంచయ్ మే జన్ భాగిదారి పథకాన్ని కొంతకాలం నుంచి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తోంది. ఈ పథకం అమలుకు సంబంధించి లక్ష్యానికి మించి పనులు పూర్తిచేసిన జిల్లాలను ప్రోత్సహించేందుకు కేంద్ర జలశక్తిశాఖ ర్యాంకింగ్‌లతోపాటు నగదు రివార్డులను కూడా అందించేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగానే రిజియన్‌ల వారిగా ఆయా జిల్లాలపనితీరును పరిగణలోకి తీసుకొని అవార్డుల ఎంపిక ప్రక్రియను చేపట్టింది. ముఖ్యంగా చెక్‌డ్యాంల ఏర్పాటు, నీటిగుంతలు, వాటర్ హర్వేస్టింగ్ స్కీమ్స్, రాళ్ల కట్టల ఏర్పాటు అలాగే పాండ్‌ల నిర్మాణం లాంటి పనులను పెద్దఎత్తున చేపట్టారు. ఈ పథకాల కారణంగా జిల్లావ్యాప్తంగా నీటి నిల్వల శాతం గణనీయంగా పెరుగుతున్నట్లు అధికారులు నిర్ధారించారు. నిర్ధేశిత గడువులోగా పక్కా నిబంధనలు పరిగణలోకి తీసుకొని కూలీలకు పనికల్పిస్తూ లక్ష్యాన్ని పూర్తిచేశారు. జిల్లావ్యాప్తంగా 63వేలకు పూగా పనులు పూర్తి కావడం విశేషంగా చెబుతున్నారు.

18న ఢిల్లీకి జిల్లా అధికారులు

ఈనెల 18న ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించే జేఎస్‌జేబీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు అలాగే డీఆర్‌డీవో పీడీ విజయలక్ష్మిలకు సంయుక్తంగా నగదు రివార్డును ప్రోత్సాహకంగా అందించనున్నారు. దీనికోసం ఈ ఇద్దరు అధికారులు ప్రత్యేకంగా ఢిల్లీకి వెళ్లనున్నారు. ఇద్దరు జిల్లాస్థాయి మహిళా ఉన్నతాధికారుల నేతృత్వంలో నిర్మల్ జిల్లాకు జాతీయస్థాయిలో టాప్ పొజిషన్ దక్కడం అందరికీ గర్వకారణమని అభినందిస్తున్నారు.

శ్రీగిరి క్షేత్రంలో కిక్కిరిసిన భక్తులు



ఆలయంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీగిరి క్షేత్రంలోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి కావడి, రథ సేవ, పంచామృతాలతో స్వామివారిని అభిషేకించారు. అలాగే ఈ కార్యక్రమంలో శ్రీ గురు మాత రాజరాజేశ్వరి దేవి ఆర్కారి రాజవ్వ శ్రీ వీర నారాయణ స్వామి, శనిగారపు చిన్నయ్య గురుస్వామి, అయిట్ల నరేష్, నీలవర్ సచిన్, పెదగొండ నగేష్, గణేష్, నరేష్, రాములు, ఆర్కారి రామయ్య, ఈశ్వర్, మాత భక్తులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చెనిగారపు చిన్నయ్య గురుస్వామి ఆలయ విశిష్టత గురించి భక్తులకు వివరించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకించారు. తదనంతరం భక్తులకు అన్నదానసేవా కార్యక్రమాన్ని గోస్కుల రమేష్, మాల్వేకర్ చరణ్‌లు అన్నదానాన్ని నిర్వహించారు.

ప్రారంభమైన సప్తాహ వేడుకలు

కుభీర్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో మంగశారం హరినామ తాళ సప్తాహ వేడుకలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వేకువజాము ఆలయంలో దేవతామూర్తులకు పంచామృత స్నానం, నూతన పట్టువస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేసి ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో సప్తహ వేడుకలను ప్రారంభించారు. ఈ వేడుకలు వారం రోజుల పాటు కొనసాగుతాయి. ప్రతీరోజు ఆలయంలో అన్నదానం, భజనలు పలు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో పురోహితుడు ప్రమోద్ జోషి, భైంసా ఆత్మ ఛైర్మన్ సిద్ధంవార్ వివేకానంద్, ఏఎంసీ చైర్మన్ కళ్యాణ్ ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఉన్నారు.

ప్రభుత్వ సలహాదారుడిని కలిసిన అల్లోల



సుదర్శన్ రెడ్డిని కలిసిన మాజీ మంత్రి అల్లోల

నిర్మల్ చైన్‌గేట్/భైంసా, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సలహాదారుడిగా నియమితులైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని మాజీ మంత్రి అల్లో ఇంద్రకరణ్ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట రాథోడ్ బాపురావు మాజీ ఎమ్మెల్యే, విఠల్‌రెడ్డి మాజీఎమ్మెల్యే, లోకభూమారెడ్డి విజయ డైరెక్టర్ ఉన్నారు. అలాగే తమ నియోజకవర్గ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన అభివృద్ధి పనులు, నిధుల విడుదలకు చొరవ చూపాలని అలాగే ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన సుదర్శన్‌రెడ్డిని సన్మానించి బాసర అమ్మవారి చిత్రపటాన్ని జ్ఞాపికగా బహూకరించి సరస్వతీ అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.



నరసింహారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ఐరన్‌మ్యాన్ టైటిల్ పొందిన డాక్టర్ నరసింహారెడ్డికి సన్మానం

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గోవాలో జరిగిన అంతర్జాతీయ ఐరన్‌మ్యాన్ పోటీల్లో పాల్గొని టైటిల్‌ను సొంతం చేసుకున్న డాక్టర్ బీఎల్ నరసింహారెడ్డిని మంగళవారం ఏఎంఆర్ టవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్రం నుంచి కేవలం 8మందికి మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కగా, అందులో నిర్మల్ నుంచి డాక్టర్ నరసింహారెడ్డి పాల్గొని టైటిల్ సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో నిర్దేశించిన సమయంలోగా 90 కిలో మీటర్లు సైక్లింగ్, 21 కిలోమీటర్లు రన్నింగ్, అరేబియా సముద్రంలో 2 కిలో మీటర్ల స్విమ్మింగ్ చేసి ఐరన్‌మ్యాన్ టైటిల్‌ను దక్కించుకోవడం మనందరికీ ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, కోశాధికారి పోతారెడ్డి, సభ్యులు లింగారెడ్డి, గంగాధర్‌గౌడ్, డాక్టర్ గోవర్ధన్ రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, గణేష్, తోట శ్రీనివాస్, సాయి వివేక్, సాయిరెడ్డి, పాల్గొన్నారు.

హ్యామ్ పథకం ద్వారా రోడ్ల నిర్మాణం చేపట్టండి

» మంత్రి కోమటిరెడ్డికి వినతి పత్రం ఇచ్చిన ఎమ్మెల్యే రామరావ్ పాటిల్



మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రామరావ్ పాటిల్

భైంసా, నవంబరు11 (ఆంధ్రజ్యోతి); ముథోల్ నియోజకవర్గ పరిధిలో హ్యామ్ పథకం ద్వారా మరిన్ని ప్రాంతాలకు రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ ఆర్అండ్‌బీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి వెంకట్‌రెడ్డిని ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ సంబంధిత విషయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. భైంసా మండలంలోని వానల్‌పాడ్ నుంచి వంజర్ వరకు, కుభీర్ మండలం సోనారి నుండి కుభీర్ మండల కేంద్రం వరకు, మాలేగాం నుంచి వర్ని వరకు రోడ్ల నిర్మాణాలకు నిధులు ఇవ్వాలని కోరారు. మంత్రి కోమటిరెడ్డి సానుకూలంగా స్పందించారని, త్వరలో నిధులు మంజూరు అవుతాయని ఎమ్మెల్యే రామరావ్‌పాటిల్ తెలిపారు. ఎమ్మెల్యే వెంట నాయకులు సతీష్‌రెడ్డి ఉన్నారు.

టీవీ ఆర్టిస్టుల సమస్యలను పరిష్కరించాలి

» సంఘం జిల్లా అధ్యక్షుడు పి. శంకర్



సమావేశంలో పాల్గొన్న ఆర్ఎస్ నంద

నిర్మల్ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సినీ అసోసియేషన్ అండ్ టీవీ ఆర్టిస్ట్ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పి. శంకర్ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా లఘు చిత్రం హీరో హాస్య నటుడు ఆర్ఎస్ నంద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ... షూటింగ్ సమయంలో కళాకారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కళాకారులకు అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ గుర్తు చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ నరేష్ వర్మ, కళాకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుచేయాలి



ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

నిర్మల్‌రూరల్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య పింఛన్ పెంపు హామీని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని, ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పింఛన్లను పెంచాలని ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట రాస్తారోకో చేశారు. అనంతరం ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్, రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు అవుతున్న ఎన్నికల ముందు ఇచ్చిన వృద్ధాప్య పింఛన్ రూ.4,000 హామీని అమలు చేయలేదని అన్నారు. కొత్త లబ్ధిదారుల దరఖాస్తులు కూడా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీనివల్ల వృద్ధులు, వితంతువులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కన్వీనర్ రామా గౌడ్, జిల్లా జనరల్ సెక్రటరీ సిహెచ్. వినోద్ కుమార్, వైస్‌ప్రెసిడెంట్ శ్రీనివాస్, కార్యకర్తలున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్

నిర్మల్‌రూరల్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగ్వాపేట్ గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడినట్లు రూరల్ తహసీల్దార్ బి. ప్రభాకర్ తెలిపారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, నిత్యావసర పంపిణీ కేంద్రం తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, కోవ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా దీపోత్సవం

నిర్మల్‌రూరల్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): ఓం శ్రీ రాజరాజేశ్వర నారాయణ మానస దేవి సహిత నవనాగ ఆలయంలో (శివాలయంలో) లక్ష వత్తులతో దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహి ంచారు. మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన, విశేష పుష్పాలతో పుష్పాభిషేకం, భరతనాట్యం సంజయశర్మ, స్వాగత్‌శర్మ, దినేష్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. 10వేల దీపాలు వెలిగించారు. శివాలయంలో దీపాల కాంతి వెలిగింది. అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. పూజ అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.



దీపోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

బాసర క్షేత్రంలో కేవీ ఏర్పాటుకు అడుగులు

» తాత్కాలిక భవనం, పాఠశాల ఏర్పాటుకు స్థలం పరిశీలన



ఆలయం వద్ద గల డార్మటరీ భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బాసర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన సరస్వతీ అమ్మవారు కొలువై ఉన్న పుణ్యక్షేత్రం బాసరలో కేంద్రీయ విద్యాలయం (కేవీ) ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. 2022 సంవత్సరంలో మంజూరైనప్పటికీ, ప్రభుత్వ స్థలం లభించకపోవడంతో ఆలస్యమవుతూ వచ్చిన కేవీ ఏర్పాటుకు సంబంధించి మంగళవారం కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. కేంద్రీయ విద్యాలయాల సమితి (కేవీఎస్) ఉప కమిషనర్ మంజునాథ్ మంగళవారం బాసరలో పర్యటించి, విద్యాలయం ఏర్పాటుకు ఉద్దేశించిన స్థలాలను పరిశీలించారు. పాఠశాల భవనాల శాశ్వత నిర్మాణానికి వీలుగా మండల కేంద్రంలోని పాప హరేశ్వరం ఆలయం పక్కన గల ప్రభుత్వ భూమిని ఆయన పరిశీలించారు. పక్కా భవనాలు సిద్ధమయ్యే వరకు తరగతులు ప్రారంభించేందుకు తాత్కాలిక భవనాన్ని కూడా అధికారులు పరిశీలించారు. అమ్మవారి ఆలయం వద్ద గల డార్మెటరీ భవనాన్ని చూసిన ఉపకమిషనర్, అందులో అన్ని వసతులు ఉండడంతో ఇక్కడే తరగతులు ప్రారంభించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలం లేక జాప్యమవుతూ వచ్చిన కేంద్రీయ విద్యాలయం త్వరలోనే తాత్కాలికంగా ప్రారంభమయ్యే అవకాశముంది. పర్యటనలో ఉపకమిషనర్ మంజునాథ్‌తోపాటు డీఈవో భోజన్న, తాహసీల్దార్ పవనచంద్ర, మండలాధికారులు పాల్గొన్నారు.